క్లుప్తంగా

అభాగ్యుడికి వైద్యం



గుర్తు తెలియని అభాగ్యుడికి వైద్యం అందిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్‌లో నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని ఆస్పత్రిలో వైద్యం చేయించి మానవత్వం చాటుకున్నాడు పట్టణానికి చెందిన కల్యాణ్. వివరాలు.. రైల్వే స్టేషన్‌లో రెండు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి ప్లాట్‌ఫారం పక్కన నిస్సహాయ స్థితిలో పడి ఉన్నాడు. బుధవారం ఉదయం పట్టణానికి చెందిన హీరో షోరూమ్ సూపర్‌వైజర్ కళ్యాణ్ కన్నా గమనించాడు. వెంటనే అతని వద్దకు వెళ్లి వివరాల కోసం ఆరా తీశాడు. అయితే ఆ వ్యక్తి మాట్లాడలేదు. దీంతో వెంటనే 108లో ఆ వ్యక్తిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. దగ్గరుండి వైద్యం చేయించాడు. కళ్యాణ్ కన్నా చూపిన చొరవను అందరూ మెచ్చుకున్నారు.

కోడి పందేలరాయుళ్ల అరెస్ట్

శింగనమల: ఆకులేడు పరిసర ప్రాంతాల్లో కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.3,200 నగదు, 5 బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నామన్నారు.

తురకపల్లిలో వైభవంగా ఊరి జాతర



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ అమ్మవారు

గుత్తి రూరల్: తురకపల్లి గ్రామంలో బుధవారం ఊరి జాతర వైభవంగా జరిగింది. గ్రామంలో వేకువజాము నుంచి పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలను తలపై ఉంచుకొని ఆలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. జాతరకు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఎస్‌ఐ నబీరసూల్ సిబ్బందితో గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువకుడికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుత్తి పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన హేమంత్ అనే యువకుడు పని నిమిత్తం మంగళవారం అర్ధరాత్రి బైక్‌పై కొత్తపేటకు బయలుదేరాడు. బైపాస్ బ్రిడ్జ్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను స్థానికులు వెంటనే 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గ్రామ దేవర



ఎమ్మెల్యే వైవీఆర్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గుంతకల్లు రూరల్: దోనిముక్కల గ్రామంలో బుధవారం గ్రామ దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామదేవత పెద్దమ్మ ఆలయంలో వేకువజామున నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు అనంతరం అమ్మవారికి పొట్టేళ్లను బలిచ్చి గ్రామంలో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ వర్క్‌షాప్‌కు జెడ్పీటీసీ ఎంపిక



భాస్కర్, జెడ్పీటీసీ

బుక్కరాయసముద్రం: తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో గురువారం నుంచి జరిగే జాతీయ వర్క్‌షాప్‌కు మండలానికి చెందిన జెడ్పీటీసీ భాస్కర్ ఎంపికయ్యాడు. రెండు రోజుల పాటు ఆరోగ్యకర గ్రామ పంచాయతీ అనే అంశంపై వర్క్‌షాప్ జరగనుంది. ఇందుకు జిల్లా తరఫున జిల్లా పరిషత్ అధికారులు తనను ఎంపిక చేశారని జెడ్పీటీసీ భాస్కర్ తెలిపారు. వర్క్‌షాప్‌నకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఏ.కొండాపురంలో చోరీ

పుట్లూరు: ఏ.కొండాపురంలో మంగళవారం రాత్రి టీ దుకాణంలో చోరీ జరిగింది. రాత్రి సమయంలో టీ దుకాణానికి ఉన్న రెండు తాళాలను పగులగొట్టిన దుండగులు షాపులో ఉన్న సిగరెట్ ప్యాకెట్లను అపహరించారు. దాదాపు రూ.60వేల విలువ చేసే సిగరెట్ ప్యాకెట్ బండిళ్లు చోరీ అయినట్లు బాధితుడు వెంకటక్రిష్ణ తెలిపారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ



వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థిస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ



ఐటీ విభాగం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడం ద్వారా జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం వారు మండల కేంద్రంలోని చేనేత కాలనీలో గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా లబ్ధి చేకూరాలంటే మరొకమారు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. జేసీ కుటుంబంలో టికెట్ ఎవరికి ఇస్తారో తెలుసుకున్న తర్వాతే ప్రజల్లోకి రావాలన్నారు. తాను ప్రజాస్వామ్య విలువలు ప్రజలకు తెలియజేశానని, జేసీ సోదరులు ఎమ్మెల్యే, ఎంపీలుగా ఉన్నప్పుడు గ్రామాల్లో కక్షలు కార్పణ్యాలు పెంచేవారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజల మధ్యే తిరుగుతూ వారి కష్టసుఖాలు తెలుసుకొని ఆదుకున్నానన్నారు. జేసీ సోదరులు గ్రామాల్లోకి ఎప్పుడో ఒకసారి వచ్చి ఒక నాయకుడి ఇంటి వద్ద కూర్చొని ఓట్లు వేయించాలని చెప్పి ఎలాంటి అభివృద్ధి చేయకుండానే చేతులు దులుపుకునేవారన్నారు. ఎవరైనా వారి మాట వినకపోతే అక్రమ కేసులు పెట్టి హింసించేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాకారం చేశామన్నారు. గతంలో ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, ప్రస్తుతం అన్ని సేవలు గ్రామ/వార్డు సచివాలవాయాల్లో ప్రభుత్వం అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. జగనన్న ప్రభుత్వం తన పాలన విధానంతో దేశంలో ఆదర్శవంతంగా నిలిచిందన్నారు. ఇవన్నీ ఓర్వలేకనే టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. యువకులను రాజకీయాల్లోకి ఆహ్వానించినప్పుడు వారిని సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. అనంతరం ఐటీ విభాగం రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గూడూరు సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, సజ్జలదిన్నె రాజు, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, బీసీ విభాగం నేత వెంకటస్వామిగౌడ్, జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, బీసీ విభాగం జిల్లా కార్యదర్శి పాశం రంగస్వామియాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామాంజులరెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు ప్రకాష్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

యాడికి: లక్షుంపల్లె కొండల్లోని నాటుసారా స్థావరాలపై సీఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించారు. లక్షుంపల్లెకు చెందిన కరిడికొండ సాంబశివుడును పట్టుకుని అతడి నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసు కున్నారు. 1000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఏఎస్‌ఐలు వెంకటేష్, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారిని కాపాడండి

యాడికి: ఎస్సీ శ్మశానానికి వెళ్లా రహదారిని కబ్జా కాకుండా కాపాడాలని లక్షుంపల్లె గ్రామానికి చెందిన ఎస్సీలు బుధవారం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఎస్సీ శ్మశాన వాటికకు 20 సెంట్ల స్థలం ఉందని, సమీప రైతులు శ్మశానం పోయే మార్గాన్ని ఆక్రమించుకుంటున్నారన్నారు. స్పందించిన తహసీల్దార్ రహదారి ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, పుల్లయ్య, నరసింహులు, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' వాలీబాల్ పోటీలు



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన యాడికి వాలీబాల్ జట్టు



పుట్లూరు: గెలుపొందిన కోమటికుంట్ల జట్టుతో అధికారులు

యాడికి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. పోటీల్లో యాడికి నం:4 సచివాలయానికి చెందిన జట్టు గెలుపొంది నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని 9 సచివాలయాలకు చెందిన టీంలు జట్లు పోటీల్లో పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ధనలక్ష్మి, యాడికి పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, పీడీలు నాగేంద్రబాబు, ఓబుళమ్మ, చిన్న ఓబులేసు, మహబూబ్ భాష, మల్లికార్జున, వీరేష్, లోకేశ్వరీ పాల్గొన్నారు.

క్రికెట్ ఫైనల్ మ్యాచ్ విన్నర్ కోమటికుంట్ల

పుట్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. మొదట బ్యాటింగ్ చేసిన కోమటికుంట్ల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 101 పరుగులు చేసింది. జట్టులో శేఖర్ 36 పరుగులతో అజేయంగా నిలిచారు. రెండోసారి బ్యాటింగ్ చేసిన కుమ్మనమల జట్టు 101 పరుగుల లక్ష్యసాధనలో 92 పరుగులు మాత్రమే చేసింది. విజేతగా నిలచిన కోమటికుంట్ల జట్టుకు ఎంపీడీఓ యోగానందరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ క్రికెట్ కిట్ అందించి నియోజకవర్గ స్థాయిలో రాణించాలని సూచించారు.

విజేతలకు అభినందనలు

గార్లదిన్నె: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడ పోటీల్లో గెలుపొందిన వాలీబాల్, కబడ్డీ జట్లను బుధవారం అధికారులు అభినందించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ విజయభాస్కర్ మాట్లాడుతూ వాలీబాల్ ఫైనల్ గార్లదిన్నె జట్టు, కబడ్డీ బాలికల పోటీల్లో ఇల్లూరు జట్టు గెలుపొందాయి. ఎంపీపీ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు క్రీడాకారులను అభినందించారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో బుధవారం ఆడుదాం ఆంధ్రాలో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పెద్దవడుగూరు గ్రామానికి చెందిన నారాయణస్వామి, జ్ఞాని ప్రతిభ చాటడంతో నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేశామని పీఈటీలు రామచంద్రబాబు, బాషా తెలిపారు.

ఆర్‌యూబీ ఏర్పాటు గుంతకల్లు అభివృద్ధికి చిహ్నం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు: ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేట్ స్థానంలో ఆర్‌యూబీ ఏర్పాటు గుంతకల్లు అభివృద్ధికి చిహ్నంగా మారబోతోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. పట్టణాభివృద్ధికి ఆవరోధంగా మారిన ధర్మవరం ఎల్‌సీ గేట్ ఎత్తివేతకు రెండేళ్లుగా రైల్వే అధికారులుతో అనేకమార్లు మంతనాలు చేసినట్లు గుర్తుచేశారు. సమస్యపై డీఆర్‌ఎంలు, రైల్వే జీఎంలతోపాటు న్యూఢిల్లీలోని రైల్వే బోర్డు కార్యాలయంలో చర్చించామన్నారు. ధర్మవరం ఎల్‌సీ గేట్ తొలగింపు పనులకు 5 నెలల కిత్రమే టెండర్లను ఆహ్వానించాల్సిందని, గేట్‌కు ఇరువైపులా ఉన్న దాదాపు 270 ఇళ్ల తొలగించాలి రావడంతో ప్లాన్ మార్చామన్నారు. యూ ఆకారంలో ప్లాన్ మార్చడం ద్వారా ఇళ్లను తొలగించకుండా చేయగలిగామన్నారు. పట్టణంలోని మార్కెట్ సమీపంలోని గుంతకల్లు–గుత్తి రైలు మార్గంలోని సత్యనారయణపేట మోరీని టూవేగా మార్చే ప్రాతిపాదనలు రైల్వే బోర్డుకు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్, డీఆర్‌ఎం మనీష్ అగార్వాల్ పంపినట్లు తెలిపారు. త్వరలోనే వాటిని అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నడూ ఇంతటి అభివృద్ధి జరగలేదు

నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ ఇంత అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. జగనన్న సారథ్యంలో గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు, రూ.15 కోట్లతో నాడు–నేడు ప్రభుత్వ ఆస్పత్రి రూపురేఖలు మార్చడంతోపాటు పూర్తి స్థాయిలో వైద్యులు. సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఆర్‌డీఓ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. పట్టణాభివృద్ధే ధ్యేయంగా 60 అడుగుల రోడ్డు నుంచి పాతగుత్తి రోడ్డు అక్కడ నుంచి సంతా మార్కెట్ రోడ్డు దీనికి లింక్‌గా బస్టాండ్ నుంచి ఎల్లమ్మతగ్గ మీదుగా పాత గుత్తి రోడ్డును కలుపుతూ రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన రహదారి, ట్రావెలర్స్ బంగ్లా విస్తరణ పనులు పూర్తి చేసినట్లు వివరించారు. దాదాపు రూ.4 కోట్లతో పాతగుంతకల్లు నుంచి దోనిముక్కల బైపాస్ వరకు సీసీరోడ్డు నిర్మించామన్నారు. పోర్టర్‌లైన్ ముస్లింల సౌకర్యార్థం ఈ ఏరియాలో రూ.కోట్ల విలువచేసే రెండెకరాల స్థలాన్ని శ్మశాన వాటిక కేటాయించినట్లు తెలిపారు. క్రైస్తవుల కోసం దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఒక ఎకరా స్థలం శ్మశాన వాటికకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కులాలకు కల్యాణమండలాలు ఒకేచోట ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఒక్కో కులానికి 20 సెంట్ల స్థలం కేటాయించామని, త్వరలో కులపెద్దలకు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. గుత్తి, పామిడి పట్టణాల్లో శాశ్వత నీటి సమస్య పరిష్కారం కోసం పీఏబీఆర్ నుంచి నీటి తరలింపునకు దాదాపు రూ.175 కోట్లతో పనులు చేపట్టామని, దాదాపు 50 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇక పామిడిలో రూ.కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎస్.రామలింగప్ప, జింకల రామాంజనేయులు, కౌన్సిలర్లు జేసీబీ చాంద్‌బాషా, వై.సుధాకర్, ఎనుమల భాస్కర్, సమోబాషా, విద్యారాణి, ఎస్సీ జిల్లా కార్యదర్శి గడ్డెల బావన్న, మాజీ కౌన్సిలర్ అహమ్మద్‌బాషా, మండల సచివాలయ కన్వీనర్ గోవింద్‌నాయక్, నాయకులు నూర్‌నిజామి, ఆంజి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో ప్రజారోగ్యానికి భరోసా



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి భరోసా ఇస్తోందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం పట్టణంలోని మోదినాబాద్ వివేకానంద మున్సిపల్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాకి విశేష స్పందన లభించింది. డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్(ఎస్‌ఎస్.పేట) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సజీవ్‌తో పాటు ఈఎన్‌టీ, చిల్డ్రన్స్, ఆప్తాలమిక్ స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ అస్మాపర్వీన్, డాక్టర్ రామాంజినేయులు, క్రిష్ణమూర్తి సుమారు 550 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. శిబిరాన్ని పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వైద్యసేవల్లో కొత్త అధ్యాయాన్ని లిఖించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తోందన్నారు. కౌన్సిలర్ కుమారి, ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్‌ఐ ఎర్రిస్వామి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని 3వ వార్డు సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం రోగులకు వరం లాంటిదన్నారు. వైద్యులు విష్ణుమూర్తి, వెంకటరమణారెడ్డి రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, కౌన్సిలర్లు వెంకట సుబ్బయ్య, ఫరూక్, వాల్మీకి శివ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్‌యాదవ్, పట్టణ కన్వీనర్ పీరా, ఉపాధ్యక్షులు వాల్మికి శివ ప్రసాద్, షఫి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు జగనన్న భరోసా



చిన్నారిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా జగనన్ననే అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక 26వ వార్డులో పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కాలనీలో ఆడుకుంటున్న చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. అమ్మఒడి పథకం అందుతోందా అని వారిని అడగ్గా అందుతోందంటూ అందరూ ఒక్కసారిగా సమాధానం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్ ఉండగా పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఢోకా లేదన్నారు. ప్రతి చిన్నారికి కార్పొరేట్ విద్యను అందించాలన్న సంకల్పంతోనే నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చివేశారన్నారు. పేద విద్యార్థులను చదివించే బాధ్యత తను సీఎం తన భుజస్కందాలపై వేసుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్.జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు రియాజ్, చిన్న నాగిరెడ్డి, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జావిద్‌ఖాద్రీ, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు జబ్బార్, లక్ష్మీరంగయ్య, దూలా రఘు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'సంకల్ప యాత్ర'

యల్లనూరు: జంగంపల్లి, పాతపల్లిలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈఓఆర్డీ విజయ్‌శేఖరనాయుడు కేంద్ర పథకాలపై వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. డ్రోన్ సాయంతో పంటలకు మందులను పిచికారీ చేసే విధానాన్ని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



శింగనమల: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శింగనమల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని ఎంపీడీఓ నిర్మలాకుమారి అన్నారు. బుధవారం సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీఓ నిర్మలాకుమారి, వైస్ ఎంపీపీ విజయ, సర్పంచ్ నాగమునెమ్మ, అధికారులు, సచివాలయ కార్యదర్శులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో శుక్రవారం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తోందని, ఈసందర్భంగా ప్రతి సచివాలయం అంబేడ్కర్ చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు రామాంజినేయులు, ఓబిరెడ్డి, వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె: కల్లూరులో సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ ప్రశాంతి ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ విజయభాస్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

గుంతకల్లు రూరల్: మండలంలో మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్లు ఏఓ కే.స్వాతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంది, జొన్న ధాన్యం విక్రయించదలచిన రైతన్నలు సంబంధిత ఆర్బీకేల్లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జొన్న మాల్దండి రకం క్వింటా రూ. 3,225, హైబ్రిడ్ రూ.3,180 చెల్లిస్తుందని తెలిపారు.

ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు

తాడిపత్రి అర్బన్: శ్రీకృష్ణదేవరాయలు ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగన సార్వభూముడిగా కీర్తింపబడ్డారని బలిజ సంఘం నాయకులు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని బుధవారం శ్రీనివాసపురంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా బలిజసంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు 20 ఏళ్ల వయసులోనే విజయనగర సింహాసనాన్ని అధిష్టించాడన్నారు. బలిజ సంఘం నాయకులు సుబ్రమణ్యం, గోపి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్‌ను బైక్‌తో ఢీ కొట్టిన ఘనుడు

గుత్తి: పట్టణ శివారులోని ప్యాపిలి రైల్వే గేట్‌ను బుధవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టాడు. వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై కర్నూలు వైపు నుంచి గుత్తి వైపునకు బయలుదేరాడు. రైలు వస్తుండంతో ప్యాపిలి రైల్వే గేట్‌ను మూసేశారు. ఇది గమనించని వ్యక్తి వేగంగా వచ్చి రైల్వేగేట్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం సేవించి బైక్ నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీకి చెందిన నందిని అనే మహిళ బుధవారం రాత్రి విష గుళికలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు ఆమెను అనంతపురం రెఫర్ చేశారు. కుటుంబ కలహాలతో ఆమె ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సిద్ధయ్య స్వామి ఆరాధన

తాడిపత్రి అర్బన్: స్థానిక టైలర్స్ కాలనీలోని మందిరంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రియ శిష్యుడు దూదేకుల సిద్ధయ్య స్వామి ఆరాధనను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా దూదేకుల కుల సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దూదేకుల సంఘం గౌరవాధ్యక్షుడు నబీరసూల్, ఉపాధ్యక్షుడు బాబావలి, సభ్యులు దూదేకుల బాషా, హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పతాకాల పంపిణీ

పామిడి: పట్టణంలో బుధవారం అయోధ్య శ్రీరాముని పతాకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పెద్ద విఠోబ ఆలయ, షావుకారు వీధిల్లోని హిందూ కుటుంబాలకు వారు జెండాలను ఉచితంగా అందజేశారు. ఇదలా ఉండగా అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయం బుధవారం తారక మంత్ర జపంతో మార్మోగిది. ఆలయంలో వారం రోజులుగా గంటపాటు భక్తుల తారక మంత్ర జపిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎలుగుబంటి సంచారంపై ప్రచారం

యాడికి: చందన గ్రామ సమీపంలో కొండల్లో ఎలుగుబంటి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుత్తి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి సూచించారు. బుధవారం ఆయన గ్రామంలో ఎలుగబంటి సంచారంపై ప్రచారం నిర్వహించారు. ఎలుగు బంట్లకు చూపు, వాసన, వినికిడి తక్కువగా ఉంటుందని, రాత్రి పూట రహదారుల వెంట, పొదల గుండా వెళ్లేటప్పుడు శబ్దం చేసుకుంటూ పోవాలన్నారు. ఎలుగుబంట్లు ఎదురైతే వాటి కళ్లకు టార్చిలైటు వేస్తే దూరంగా పారిపోతాయన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఎఫ్‌బీఓలు మాదవి, రామాంజనేయులు, ఏబీఓలు మంజుల, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

గార్లదిన్నె: ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. తొలిరోజు ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ , ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, 19న వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, వైకేపీ సీసీలకు శిక్షణ ఉంటుందన్నారు. పైన తెలిపిన వారంతా కేటాయించిన తేదీల్లో శిక్షణకు హాజరు కావాలని ఆయన కోరారు.